యంత్రాలకు యమ డిమాండ్

- అకాల వర్షాలతో పెరిగిన గిరాకీ
- ఇతర జిల్లాల నుంచి తెస్తున్న వ్యాపారులు
- అద్దె పెరగడంతో అన్నదాత ఆందోళన



కాజులూరు మండలం మొగలిపాలెంలో కోత కోస్తున్న వరికోత యంత్రం

కాజులూరు: అకాల వర్షాలు తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న నియోజకవర్గ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దిగుబడి అశాజనకంగా ఉండి పంట చేతికందుతున్న తరుణంలో గత వారం రోజులుగా చెదురుమదురుగా విడవకుండా కురుస్తున్న వానలు పంటపొలాలను నీట ముంచాయి. దీంతో పంటను దక్కించుకునేందుకు అన్నదాతలు నానా హైరానా పడుతున్నారు. కూలీల కొరతతో వరికోత యంత్రాలతో మాసూళ్లు నిర్వహించాల్సి వస్తోంది. అయితే రైతులంతా ఒకేమారు అవసరం రావడంతో వరికోత యంత్రాలకు ఎక్కడ లేని డిమాండ్ వచ్చిపడింది. దీనిని అదునుగా తీసుకుని వ్యాపారులు యంత్రాలకు అద్దె పెంచడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 52 వేల ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేపట్టారు. వర్షాల సమయానికి కె.గంగవరంలో 40 శాతం, రామచంద్రపురం మండలంలో 50 శాతం కోతలు పూర్తవగా కాజులూరు మండలంలో 18,076 ఎకరాల సాగుకుగానూ అధికారిక లెక్కల కేవలం 8175 ఎకరాల్లో మాత్రమే రైతులు మాసూళ్లు నిర్వహించారు. మిగిలిన పొలంలో పంట కోత కోయాల్సి ఉంది. అయితే పంటకాలం పూర్తయిన కారణంగా వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా మాసూళ్లు పూర్తి చేయాలని లేని పక్షంలో గింజ రాలిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీంతో రైతులంతా ఒకేసారి వరికోతలు చేపట్టడంతో కూలీలు దొరకటం కష్టంగా మారింది. ఒకవేళ కూలీలు దొరికినా వేతనాలు ఎక్కువవడంతో అందరి దృష్టి వరికోత యంత్రాలపైనే పడింది. మండల గ్రామాల్లో రైతుమిత్ర సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు కోతమెషీన్లతో కలిపి కేవలం 30 కోత మెషీన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలకు ముందే మాసూళ్లు పూర్తయ్యాయి. వరికోత యంత్రాలకు ఇక్కడ ఏర్పడ్డ డిమాండ్ దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు పక్క జిల్లాల నుంచి వరికోత యంత్రాలను రప్పించారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో 60 వరకూ వరికోత యంత్రాలు నడుస్తున్నాయి. అయితే ప్రస్తుం వాతావరం కాస్త తెరపినిచ్చినప్పటికీ మధ్యమధ్యలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముతుండటం, దానికి తోడు మరో కొన్ని రోజులు వర్షాలు పడేందుకు అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతుండటంతో ఉన్న పంటను ఏదో విధంగా దక్కించుకోవాలని రైతులంతా వరికోత యంత్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు. దీంతో నిర్వాహకులు డిమాండ్‌కు తగ్గట్టుగా అద్దె పెంచేస్తున్నారు. వర్షాల సమయానికి నియోజకవర్గ గ్రామాల్లో వరికోత కోయడానికి ఎకరానికి రూ.2500 నుంచి 2600 వరకు ఉండేది. ఎకరం పొలంలో పంట కోత కోయడానికి యంత్రానికి గంట సమయం పట్టేది. ప్రస్తుతం వర్షాలకు పొలాల్లో నీరుచేరి ఉండటంతో ఎకరం పొలం కోత కోయడానికి గంటన్నర సమయం పడుతుంది. వర్షాల భయంతో రైతులంతా ఒక్కసారిగా పనులు ప్రారంభించడంతో మెషీన్ యజమానులు గంటల లెక్కన గంటకు రూ.3000 తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఎకరానికి పంటకోత కోయడానికి రూ.4500 వరకూ ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. వరికోత యంత్రాల ధర రూ.25 లక్షల నుంచి 30 లక్షల వరకూ ఉంటుంది. స్థానిక రైతులు అంత ధరపెట్టి యంత్రాలు కొనలేకపోవడంతో కొందరు నిర్వాహకులు పక్క జిల్లాల నుంచి యంత్రాలను రప్పించి డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయాల్లో అద్దె ధరలు పెంచి వసూళ్లు చేస్తున్నారని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు.

యంత్రాలను సబ్సిడీపై అందజేయాలి



వరికోత యంత్రాలు స్థానికంగా తక్కువగా ఉండటంతో సీజన్‌లో ఇతర జిల్లాల నుంచి రప్పించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఆసక్తి ఉన్న రైతులందరికీ యంత్రసేవా పథకం ద్వారా 50 శాతం రాయితీపై వరికోత యంత్రాలను రైతులకు అందజేయాలి.

– కేశన వీర్రాజు, రైతు అంగ్రంగి

● రిలే దీక్షలకు తరలిన నేతలు



అమలాపురంలో జరిగిన వైఎస్సార్ సీపీ రైతు రిలే దీక్షలో ఎమ్మెల్సీ, పీఏసీ సభ్యుడు తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో పాల్గొన్న మండపేట నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు



అమలాపురంలో జరిగిన వైఎస్సార్ సీపీ రైతు రిలే దీక్షలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పాల్గొన్న రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు

కాజులూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అబివృద్ధిని చూసి ఓర్వలేకే కొంత మంది బీసీ నాయకులు తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ మేడిశెట్టి వీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం కాజులూరులో పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జ్ వనుం వీర బ్రహ్మం అధ్యక్షతన జరిగిన బీసీ నాయకుల సమావేశంలో మండల బీసీ సెల్ కన్వీనర్ వల్లు అర్జునరావు, కోట తాతబ్బాయి తదితర నాయకులు మాట్లాడుతూ కుట్టుమెషీన్ల శిక్షణ, పంపిణీపై కూటమి ప్రభుత్వం రూ.కోట్లు దోచుకునేందుకు ప్రయత్నిస్తుందంటూ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



విశేష అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

కపిలేశ్వరపురం: స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ నాయకుడు సుగంధం వీరవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. స్వామివారిని కీర్తిస్తూ భక్తి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలి



అంగరలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కపిలేశ్వరపురం: యువత అల్లూరి సీతారామరాజు ఆశయ స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు సూచించారు. అంగరలో బుధవారం అల్లూరి వర్ధంతి నిర్వహించారు. హైస్కూల్ సమీపాన ఉన్న అల్లూరి విగ్రహానికి సామాజిక కార్యకర్త చిన్నా నాగ సతీష్ వర్మ పూలమాల వేసి నివాలర్పించారు. థియేటర్ సెంటర్‌లోని విగ్రహం వద్ద ఐఎఫ్‌టీయూ, పీడీఎస్, పీవైఎల్ తదితర ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, వెంటపల్లి భీమశంకరం, లంకె విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల బతుకులు మెరుగుపడలేదన్నారు. అల్లూరి పోరాట పటిమతో పాలకులపై ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నున్న రమేష్, చీకట్ల శ్రీనివాస్, తుట్టుపు శ్రీనివాస్, కంజుల గోవిందరాజు, విశ్వనాథపల్లి వెంకటరమణ, లంకె స్వామి పాల్గొన్నారు.

విప్లవజ్యోతి అల్లూరి

రామచంద్రపురం: విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమవుదామని పీడీఎస్‌యూ, పీవీఎల్ ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక పాత బస్టాండ్ వద్ద భారత జాతీయ ఉద్యమ విప్లవవీరుడు, మన్యం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతిపీడీఎస్‌యూ, పీవీఎల్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకన్న, పీవీఎల్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, సీపీఐ రామచంద్రపురం పట్టణ కార్యదర్శి ఎం.రాము, రామచంద్రపురం డివిజన్ బీఎస్పీ అధ్యక్షుడు ఆలీ మాస్టర్ సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని ద్రాక్షారామ శ్రీనివాస శైల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను కొనియాడారు.

కలవరపెడుతున్న వాతావరణం



ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతులు

కె.గంగవరం: ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉన్న తరుణంలో ఇప్పుడు ప్రకృతి కన్నెర్ర చేస్తుందోమోనని రైతులు కలవరపడుతున్నారు. సుమారు 60 శాతం పంట కోత కూడా కోసి ధాన్యాన్ని రోడ్ల మీద, పొలం గట్లపై రైతులు అరబెట్టుకున్నారు. మరి కొంత మంది రైతులు పనలను కోసి చేలోనే వదిలేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బుధవారం ఉదయం నుంచి ఏకధాటిగా ఈదురు గాలులతో కురిసిన వర్షానికి రైతులు ఆవేదన చెంతున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల మరో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించడంతో పాటు ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో ఈదురు గాలులు, చినుకులు పడడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పంటను వర్షాల బారి నుంచి కాపాడుకోవడానికి ప్రస్తుతం రైతులు నానా పాట్లు పడుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కాజులూరు: రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అన్నారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ప్రతిఘటిస్తూ బుధవారం అమలాపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసన దీక్షా శిబిరానికి కాజులూరు మండల గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ముందుగా వీరంతా గొల్లపాలెంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు (జట్టీలు) లేకపోవడంతో ధాన్యం కొనుగోలు జరగడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీలు బస్తాకు రూ.1725 ప్రకటించినప్పటికీ మిల్లర్లు దళారుల ద్వారా రూ.1550 మించి కొనుగోలు చేయడం లేదన్నారు. వర్షాలకు ధాన్యం రంగు మారిందని నాణ్యతా లోపం పేరుతో మరో రూ.100 వరకూ తగ్గించి కొంటున్నారన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోక రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతుంటే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగక తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుందన్నారు. దీంతో నికర ఆదాయం తగ్గి అప్పుల పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో కాటా, జట్టును ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ప్రోత్సహించి రైతులు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు చొల్లంగి రమణ, మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, మండల అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు చింతా నవీన్, సంఘ సభ్యులు గుత్తుల లోవరాజు, గుత్తుల ఈశ్వరరావు, పెంకే దుర్గాప్రసాద్, సువ్వారి గోవిందు, దంగేటి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బ్రహ్మకమలాలు



కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని ఓ ఇంటిలో విరబూసిన బ్రహ్మకమలాలు ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలోని ధర్మగుండం చెరువు సమీపంలో నివాసముంటున్న అడపా నారాయణబాబు మూడేళ్ల క్రితం కడియం నర్సరీ నుంచి తీసుకొచ్చిన బ్రహ్మ కమలం మొక్కను తన ఇంటి పెరట్లో నాటారు. ఆ మొక్కకు రెండు బ్రహ్మకమలాలు పుష్పించాయి. ఎక్కడో హిమాలయాల్లో కనిపించే బ్రహ్మ కమలాలు పట్టణంలో పూయడంతో నారాయణబాబు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అరుదైన ఆ పుష్పాలను చూసేందుకు సమీప నివాసితులు క్యూ కడుతున్నారు.

అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ

- అమలాపురంలో గళం వినిపించిన రైతు నాయకులు
- ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లిన నేతలు



అమలాపురం నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట, మండపేట నియోజకవర్గ నాయకులు

కపిలేశ్వరపురం: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనాలంటూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అమలాపురంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి నిరసన కార్యక్రమానికి మండపేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రైతు అనుకూల నినాదాలు చేస్తూ తరలి వెళ్లారు. మోటారు బైక్‌లపై కోటిపల్లి రేవు మీదుగా అమలాపురానికి ర్యాలీగా తరలివెళ్తుండగా ఆయా ప్రాంతాల్లోని రైతులు ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం పలికారు. ఆయనకు రైతులు తమ సమస్యలను చెప్పుకొన్నారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనేందుకు రైతు సేవా కేంద్రాలకు ప్రభుత్వం టార్గెట్ నిర్ణయించడమేంటో అర్థం కావడంలేదంటూ రైతులు అసహనం వ్యక్తం చేశారు. వారికి ఎమ్మెల్సీ తోట ధైర్యం చెప్పారు. అమలాపురం నిరసన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, జెడ్పీటీసీలు పుట్టపూడి అబ్బు, కుడుపూడి భవాని, నల్లమిల్లి మంగాతాయారు, ఎంపీపీలు నౌండ్రు వెంకటరమణ, ఉండమట్ల శ్రీనివాస్, పార్టీ కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు రైతులనుద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఏడాది పాలనాకాలంలోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై చేతులెత్తేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పసలపూడి శ్రీనివాస్, సిరిపురపు శ్రీనివాస్, ముమ్మిడివరపు బాపిరాజు, దొందులూరి శ్రీరామవర్మ, నక్కా సింహాచలం, పలివెల మధు, పెంకే గంగాధర్, పలివెల సుధాకర్, పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



అంగరలో బరకాలతో కప్పిన ధాన్యం రాశుల్లోకి చేరిన వర్షపు నీరు



రాయవరం మండలంలో భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

అకాల వర్షం.. తీరని నష్టం

- తడిసి ముద్దయిన ధాన్యం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

రాయవరం: అకాల వర్షం రైతులకు తీరని నష్టం మిగిల్చింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కురిసిన భారీ వర్షానికి రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు రైతులు రహదారుల వెంబడి, పొలాల్లో, లే అవుట్లలో ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఒక్కసారిగా కమ్ముకున్న మేఘాలతో చీకటి వాతావరణం అలముకుంది. రైతులు అప్రమత్తమయ్యే లోపు ఈదురుగాలతో భారీ వర్షం కురిసింది. ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరబెట్టుకోవడం, తడుపుకోవడంలా రైతుల పరిస్థితి మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షానికి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రహదారులపై మోటార్ సైకిళ్లు నిలిపి తడవకుండా ఉండేందుకు గుడులు, చెట్లను ఆశ్రయించారు.

కుండపోత వర్షానికి స్తంభించిన జనజీవనం

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ద్విచక్రవాహనాలపై విక్రయాలు చేసుకొనే చిరు వ్యాపారాలు ఇబ్బందులకు గురయ్యారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ఇటుక బట్టీల నిర్వహణ నిలిచిపోయింది. మండలంలోని 17 గ్రామాల్లో 80 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. అయినప్పటికీ కొనుగోలులో సమస్య తలెత్తడంతో ధాన్యం రహదారులు, వ్యవసాయ క్షేత్రాల్లో నిలిచిపోయింది. టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట తదితర గ్రామాల్లోని రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకొనేందుకు నానా యాతన పడ్డారు. గ్రామాల్లోని వీధులు వర్షపు నీటితో నిండిపోయాయి.

మండపేటలో...

మండపేట పట్టణంతో పాటు ద్వారపూడి, కేశవరం, మెర్నిపాడు, ఏడిద తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ద్వారపూడి తదిరత గ్రామాల్లోని వివిధ రంగాల్లోని శ్రామికులు పని ప్రదేశాల్లో ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో కురిసిన వర్షానికి చిరు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసుకొన్నారు.



ధాన్యం రాశి వద్ద నీటిని బయటకు పంపేందుకు అన్నదాత ఇక్కట్లు



ధాన్యపు రాశులపై బరకాలు ఎగరకుండా ప్రయత్నం చేస్తున్న కర్షకులు



రాయవరంలో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం

వాసవీమాతకు విశేష పూజలు



మండపేట పట్టణంలో వాసవీ మాతను ఊరేగిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను మండపేట పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వల్లూరి వారి వీధిలోని అమ్మవారి ఆలయం నుంచి కలువపువ్వు సెంటర్ కేపీ రోడ్డు మీదుగా పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కేరళ వాయిద్యాలు ఆద్యాంతం ఆకట్టుకొన్నాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, అధ్యక్షుడు సంకా శ్రీనివాస రంగా, ఆలయ ధర్మకర్త బోనగిరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి

రాయవరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం వాసవీమాత జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి బ్రహ్మన్న, ఉపాధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి వీరభద్రరావు ఆధ్వర్యంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పల్లకీలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో రాయవరం, వెదురుపాక పరిసర గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రాయవరంలో వాసవీమాత గ్రామోత్సవం

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసియున్న వాసవీ అమ్మవారి జన్మనక్షత్ర పూజలు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వారణాసి కార్తికేయశర్మ బ్రహ్మత్వంలో కొమ్మిశెట్టి గోపాల్, రమా శైలజ దంపతులు, వరదా సంతోష్ కుమార్, రామనాగ సత్య సౌందర్య బిందు దంపతుల చేతుల మీదుగా జన్మ నక్షత్ర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లలితా సహస్ర పారాయణ ఆచరించారు. అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించారు.

వల్లూరులో జనసేన సమావేశం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో బుధవారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు.